

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# పథకాల అమలు తీరుపై కలెక్టర్ తనిఖీ



గుడిసె వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్

**కొడంగల్, జులై 31, ప్రభాతవార్త :** ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శుక్రవారం బొంరాస్‌పేట్ మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ప్రాథమిక కేంద్రాన్ని, బొట్లవానితండాలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మెరుగైన వైద్యంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలం ఉన్నందున పాము కాటుకు సంభందించి మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్థులకు ఆసరా పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ధ్రువీకరణ పత్రాలను వెంటనే ఇవ్వాలని కలెక్టర్ వైద్యాధికారిని ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని అనారోగ్య వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఇన్ పేషెంట్, ముందుల నిల్వ గది, అపరేషన్ థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు.
10వ తరగతిలో తెలుగు బోధనను పరిశీలించారు. విద్యార్ధినిలతో విద్యతో పాటు తమ సృజనాత్మకతను తీసుకువచ్చే విధంగా ఇండోర్ గేమ్‌లను ఏర్పాటు చేలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థునిలకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ తెలిపారు. నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించిన క్రమంలో పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని పరిశీలించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హౌసింగ్ అధికారికి సూచించారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ గుట్టూరు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి పద్మావతి, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, వైద్యాధికారి హేమంత్‌లు ఉన్నారు.





గ్రామసభలో ఫిర్యాదు చేస్తున్న బాదితుడు (ఇన్‌సెట్) నీళ్లు కలిసిన పెట్రోల్ బాటిల్

# పెద్దేముల్ పెట్రోల్‌లో మూడొంతుల నీళ్లు!

**పెద్దేముల్, జులై 31, ప్రభాతవార్త:** ఇంధనంలో నీరు కలిసినట్లు వినియోగదారులు అనుమానాలు వ్యక్తంచేస్తు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పెద్దేముల్ గ్రామ శివారులోని కోహీర్ రవికి చెందిన పెట్రోల్ పంపులో వినియోగదారుడు ఖాజమియ్యా తన వాహనంలో రూ.150, బాటల్‌లో రూ.50 పెట్రోల్ పోయించుకున్నారు. బాటిల్‌లో వేసిన పెట్రోల్‌లో 70 శాతము నీరు, 30 శాతము పెట్రోల్ ఉండటం చూసి వినియోగదారుడు షాక్‌కు గురయ్యారు. ఇదేమిటని ప్రశ్నించగా పెట్రోల్ పోసుకున్న బాటిల్‌ను యాజమాన్య సిబ్బంది తీసుకొని వాపస్ ఇవ్వలేదని భాధిత

**ఫిల్లింగ్ స్టేషన్‌పై వినియోగదారుల ఆగ్రహం**

**అధికారుల తనిఖీలకు డిమాండ్**

**గ్రామసభలో ఫిర్యాదు చేసిన బాధితులు**

**తాత్కాలికంగా బంకు మూసి ఉంచాలని తహసీల్దార్ ఆదేశం?**

వినియోగదారుడు ఆందోళన వ్యక్తంచేశాడు. అంతేగాకుండా తన వాహనం కూడా స్టార్ట్ కాకపోవడంతో దీంతో ఆగ్రహించిన వినియోగదారుడు పెద్దేముల్ గ్రామసభలో సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళాడు. ఈ సందర్భంగా ఖాజమియ్యాతో పాటు పలువురు వినియోగదారులు మాట్లాడుతూ పెట్రోల్ పోయించిన వెంటనే తమ వాహనాలు స్టార్ట్ కావడంలేదని, ఇంధనంలో నీరు కలిపి విక్రయిస్తున్నారని అనుమానాలు వ్యక్తంచేశారు. సంబందిత అధికారులు ఫిల్లింగ్ స్టేషన్ లోని భూగర్భ ట్యాంకులను వెంటనే తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. సంబందిత అధికారులు ఇంధన నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరిక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాణ్యతలోపం తేలితే భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన వాహనదారులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులకు టోకరా వేసేందుకు పెట్రోల్ పేరుతో నీళ్ళు అమ్ముతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని ఇంధనంతో వాహనాలకు ముప్పు ఏర్పడుతుందని, అందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని గ్రామసర్పంచ్ డివై నర్సిములు స్థానిక తహసీల్దార్ ఫోన్‌లో మాట్లాడుతు బంకులో నీళ్ళు కలిపిన పెట్రోల్ వస్తుందని, దీంతో లక్షలాది రూపాయిల విలువగల వాహనాలు పాడై తీవ్ర నష్టం వాటిల్లుతుందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారని, అందుకు తగు విచారణ జరిపించాలని కోరారు. తాత్కలికంగా పెట్రోల్ పంపును మూసి ఉంచాలని తహసిల్దార్ యాజమాన్యంకు సూచించినట్లు సమాచారం.

**ఏసీ రూమ్‌ల సమీక్షలకే పరిమితం కాకుండా స్వయంగా రంగంలోకి దిగిన ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు ముగుస్తున్న నేపథ్యంలో మేడ్చల్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. తిమ్మాయిపల్లి, దూళ్లపల్లి వీధుల్లో నేరుగా పర్యటించారు. బీఎల్‌ఓల వెంట ఉంటూ ఓటర్ల వివరాల సేకరణను పర్యవేక్షించారు. పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, తుది గడువులోగా వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశిస్తూ జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. పారదర్శకత లేకపోతే ఊరుకునేది లేదని ఖరాకండీగా స్పష్టం చేశారు.**

# రెండు రోజుల్లో.. పని తేలాల్సిందే

## ఓటర్ల లిస్ట్ నిర్లక్ష్యానికి ఈసీఐ సెక్రటరీ నవీన్ కుమార్ రెడ్ కార్డ్



**పైపైన పనులు కానిచ్చేస్తే సరిపోదని స్పష్టీకరణ**

**ఫారమ్‌ల పెండింగ్‌పైనా సీరియస్**

**ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉన్నారని అసంతృప్తి**

**క్షేత్రస్థాయి ఆకస్మిక తనిఖీలతో హల్‌చల్**

**పోలింగ్ బూత్‌లు ప్రభుత్వ భవనాలకి మార్చాలని ఆదేశం**

**సర్ ప్రక్రియ రెండ్రోజుల్లో పూర్తిచేస్తాం: కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 31, ప్రభాతవార్త :** మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఫారమ్‌ల డిజిటైజేషన్ మ్యాపింగ్ ప్రక్రియల పురోగతిపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కార్యదర్శి నవీన్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే, అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ, ఇతర జిల్లాలతో పోలిస్తే కొన్ని ప్రాంతాల్లో పని నెమ్మదించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.
ప్రత్యేక సవరణ ప్రక్రియకు ఇక రెండు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని ఈసీఐ కార్యదర్శి గుర్తుచేశారు. మిగిలి ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని, బూత్ లెవల్ ఆఫీసర్లతో కలిసి పనిచేయాలని, నిర్దేశిత సమయం కంటే ముందే వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఫారమ్‌లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మ్యాపింగ్ కాని వారిలో వేరే ప్రాంతాలకు షిఫ్ట్ అయిన ఓటర్లే ఎక్కువగా ఉన్నారని, వారితో సంప్రదింపులు జరిపి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతి నోటీసును ఓటరుకు చేరవేసి, వారి ప్రతిస్పందనలను పట్టికల రూపంలో ఈఆర్‌ఓలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కోసం కీలక మార్గదర్శకాలను కార్యదర్శి జారీ చేశారు.

**ప్రైవేట్ బిల్డింగ్స్‌లో పోలింగ్ కేంద్రాలు కుదరవు**

ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలను వెంటనే సమీపంలోని ప్రభుత్వ భవనాలు లేదా కమ్యూనిటీ హాళ్లకు తరలించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి గరిష్టంగా 1,200 మంది ఓటర్లను ప్రామాణికంగా తీసుకుని హేతుబద్ధీకరణ చేపటాలని సూచించారు.

**రాజకీయ పార్టీల భాగస్వామ్యం తప్పనిసరి**

పోలింగ్ కేంద్రాల మార్పులు లేదా ఇతర కీలక సవరణలు చేసే ముందు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ మను చౌదరి జిల్లా పరిస్థితిని ఈసీఐకి వివరిస్తూ.. మేడ్చల్ జిల్లా పరిధిలో మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్ అనే 5 అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 24.60 లక్షలుగా ఉన్న జనాభా, 2025 నాటికి 48 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు సేకరించలేని ఫారమ్‌లతో కలిపి మొత్తం 85 డిజిటైజేషన్ పూర్తి చేశామని, మిగిలిన 1516 పనిని రాబోయే 12 రోజుల్లో పూర్తి చేస్తామని పిపిటి ద్వారా వివరించారు.
క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన సమీక్ష అనంతరం ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. మేడ్చల్ నియోజకవర్గంలోని తిమ్మాయిపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూళ్లపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. అక్కడ జరుగుతున్న సర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, స్థానిక బీఎల్‌ఓలతో మాట్లాడి సమస్యలు, నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఇఆర్‌ఒలు వెంకట్ రెడ్డి, సంచిత్ గంగ్వార్, పింకేష్ కుమార్, రాధిక గుప్తా, మయాంక్ సింగ్, ఆర్‌డిఒ మాలతి, ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు.



బిఎల్‌ఒల పనితీరును తనిఖీ చేస్తున్న ఈసిఐ సెక్రటరీ నవీన్‌కుమార్

# నిర్మాణాలపై నిఘా

**ఎడ్యుకేషన్ హబ్ పనుల ప్రదేశంలో సిసి కెమెరాలు**

**కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం**

**కొడంగల్, జులై 31, ప్రభాతవార్త:** మానవ వనరులు, సామర్థ్యాన్ని పెంచుకొని ఎడ్యూకేషన్ హబ్‌లో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. శుక్రవారం దుద్యాల మండలం హాకీంపేట్ ఎడ్యూకేషన్ హాబ్‌కు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రలు ఆకస్మికంగా పర్యటించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూల్లలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎడ్యూకేషన్ హబ్ పనులను ప్రతిరోజు పర్యవేక్షిస్తు పనులను వేగవంతం చేయాలన్నారు. డ్యూకేషన్ హాబ్‌లో చేపట్టే ప్రతిపని వద్ద ఇంచార్జ్‌ల పర్యవేక్షణలో నిర్మాణ పనులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణాలు చేపడుతున్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఇడబ్ల్యుఐడిసీ అధికారులు, ఇంజనీర్‌లు ఉన్నారు. అనంతరం నర్సింగ్ హస్టల్, పారా మెడికల్, ఫిజియోథెరఫిలాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ స్కూల్, నర్సింగ్, వెటర్నరీ కళాశాలలకు సంభందించి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు.



ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**శ్రీవారి ఆలయ పనుల తనిఖీ**

కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు సంభందిత అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్‌లో నిర్మిస్తున్న శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవ స్థానం పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. అనంతరం స్థానిక కడా కార్యాల యంలో ఇంజనీరింగ్, కన్సల్టెన్సీ ఏజన్సీ, ప్లానింగ్ డిజైనర్స్, కాంట్రాక్టర్లతో ఆలయ పనుల నిర్మాణాలపై సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎంఓ ప్రిన్సి పల్ సెక్రటరీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఫిబ్ర వరి మాసంలో నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలకు గాను దేవాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. దేవాలయానికి సంభందించి భూ సేకరణ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, దేవాలయ సీఈఓ, ఆర్‌అండ్‌బిఎస్ఈ వసంతనాయక్, డీఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమైన ఎంపి ఈటల రాజేందర్

# అధిక సంఖ్యలో గృహాలు మంజూరు చేయాలి

**మేడ్చల్, జులై 31, ప్రభాతవార్త :** సహచర తెలంగాణ బీజేపీ ఎంపీలతో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని గ్రామీణ రహదారులను మంజూరు చేయాలని, అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన పేద కుటుంబాలకు అధిక సఖ్యలో గృహాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పేదల సొంత ఇంటి కల సాకారం కోసం కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని కోరారు. బీజేపీ ఎంపీలు డీకే అరుణ, మాధవనేని రఘునందన్ రావు, గోడం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి

# 10శాతం గ్రీన్ బడ్జెట్‌కు గ్రీన్‌సిగ్నల్

**శామీర్‌పేట, జులై 31, ప్రభాతవార్త :** అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీష కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేయటానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10శాతం గ్రీన్ బడ్జెట్ కేటాయింపులపై చర్చించి పచ్చదనాన్ని పెంచటానికి కార్యక్రమాలు అమలు చేయాలని సమావేశంలో ఆమోదించారు. వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముగ్గురితోనే..

## మాడ్గుల తహసీల్దార్ కార్యాలయం!




**మాడ్గుల జులై 31, ప్రభాతవార్త:** ప్రజలకు అత్యంత కీలకమైన రెవెన్యూ సేవలను అందించే మాడ్గుల తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం తీవ్ర సిబ్బంది కొరతతో అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయంలో ఉండాల్సిన కీలక పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉండటంతో కేవలం ముగ్గురు ఉద్యోగులే అన్ని బాధ్యతలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధిత సేవలు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి పనులు తీవ్ర జాప్యానికి గురవుతున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
మాడ్గుల మండల పరిధిలోని గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది వివిధ అవసరాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యూటేషన్, వారసత్వ మార్పులు, పట్టాదార్ పాస్‌బుక్స్‌కు సంబంధించిన దరఖాస్తులు, భూ రికార్డుల సవరణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ధ్రువీకరణలు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలు, ఎన్నికల విధులు, విపత్తుల సమయంలో ప్రత్యేక బాధ్యతలు వంటి అనేక పనులు ఈ కార్యాలయం ద్వారా నిర్వహించబడతాయి. అయితే సిబ్బంది కొరత కారణంగా ఈ సేవలు సకాలంలో అందడం లేదని ప్రజలు చెబుతున్నారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల మాడ్గులలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ భార్గవరాం బదిలీపై ఇబ్రహీంపట్నంకు వెళ్లడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యాలయం ఇప్పుడు మరింత ఒత్తిడిలో పనిచేయాల్సి వస్తోంది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న కొద్దిమంది ఉద్యోగులే ఒకేసారి పలు విభాగాల పనులను నిర్వహించాల్సి వస్తోంది.

**ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**రోజుల తరబడి ఎదురు చూపులు**

**కీలక పోస్టులు ఖాళీ**

**ఉన్న సిబ్బందికి పెరుగుతున్న పనిభారం**

**నత్తనడకన రెవెన్యూ సేవలు**

ఒకవైపు ప్రజల దరఖాస్తులు స్వీకరించడం, మరోవైపు రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ ఆదేశాల అమలు, ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం, కోర్టు వ్యవహారాలకు సంబంధించిన సమాచారం సిద్ధం చేయడం, ఎన్నికలు, సర్వేలు, విపత్తు నిర్వహణ వంటి అదనపు బాధ్యతలు కూడా అదే సిబ్బందిపై పడుతున్నాయి. దీంతో కార్యాలయంలో పనిభారం రోజురోజుకూ పెరుగుతోంది. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆన్‌లైన్ సేవలు కూడా ఆలస్యమవుతున్నాయని సమాచారం. ప్రస్తుతం చాలా ప్రభుత్వ సేవలు పూర్తిగా డిజిటల్ విధానంలోనే అందుతున్న నేపథ్యంలో కంప్యూటర్ సంబంధిత పనులన్నీ ఇతర ఉద్యోగులే నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రజలు ఒకే పని కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. అటెండర్ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో కార్యాలయంలో సాధారణ పరిపాలనా పనులు కూడా సక్రమంగా సాగడం లేదని తెలుస్తోంది. ఫైళ్ల తరలింపు, రికార్డుల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ వంటి చిన్నచిన్న పనులను కూడా అధికారులు, సిబ్బందే చూసుకోవాల్సి వస్తోంది. దీని ప్రభావం ఇతర పరిపాలనా పనులపై కూడా పడుతోంది. వర్షాకాలం, వ్యవసాయ సీజన్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రత్యేక సర్వేలు వంటి కార్యక్రమాల కారణంగా ఈ సమయంలో రెవెన్యూ శాఖపై పనిభారం మరింత పెరిగింది. రైతులు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, సాధారణ ప్రజలు ధ్రువీకరణ పత్రాల కోసం ఎక్కువగా కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు.
అయితే సిబ్బంది లేకపోవడంతో దరఖాస్తుల పరిష్కారం ఆలస్యమవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు స్పందిస్తూ మాడుగుల తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ముఖ్యంగా జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ పోస్టులతో పాటు అవసరమైన అదనపు సిబ్బందిని కూడా నియమిస్తే మాత్రమే కార్యాలయ పనితీరు మెరుగుపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించాలంటే మాడుగుల తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సిబ్బంది కొరతను అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే రానున్న రోజుల్లో ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రేపు 'నషా ముక్త్ భారత్'

**రంగారెడ్డి జిల్లాలో మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞకు భారీ ఏర్పాట్లు**

**కోటి మందితో వర్చువల్ ద్వారా ప్రధాని మోడీ సంభాషణ**



**రంగారెడ్డిఅర్బన్, జులై 31, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన మాదకద్రవ్య రహిత భారత (నషా ముక్త్ భారత్) జాతీయ ఉద్యమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు వేగవంత మయ్యాయి. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మరియు మై భారత్ ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞా స్వీకారాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రధాన కార్యక్రమాలను రంగారెడ్డి జిల్లాలోని సి.బి.ఐ.టి సాంకేతిక విద్యా ప్రాంగణంతో పాటు హైదరాబాద్‌లోని విజ్ఞాన భారతి కాలేజీ, సిద్ధిపేటలోని కావేరి విశ్వవిద్యాలయం, వరంగల్ లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఇవే కాకుండా మిగిలిన జిల్లాల్లోనూ జిల్లా స్థాయి కమిటీల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ఈ కార్యక్రమాలను చేపట్టనున్నాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు 10,000 కేంద్రాల ద్వారా ఒక కోటి మందికి పైగా యువతతో ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా సంభాషించి సందేశమివ్వనున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించనున్నారు. వికసిత్ భారత్ రాష్ట్ర యువ భారత్ సంస్థ సంచాలకులు అన్వేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం ఒక్క రోజు కేటాయించే అవగాహన సదస్సు మాత్రమే కాదు, యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించే ఒక జాతీయ ఉద్యమం అని స్పష్టం చేశారు.
2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజమే బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది విద్యార్థులు, యువత, వాలంటీర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# విద్యార్థులకు డెంటల్ మెడికల్ స్క్రీనింగ్

**శామీర్‌పేట, జులై 31, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం శుక్రవారం డెంటల్ మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. హైదరాబాద్ భారత్ లిమిటెడ్ ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ విచ్చేసి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్‌లు అభినందించారు.



పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ షాద్ నగర్ పట్టణం శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజన్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, గౌస్ జానీ, గోపాల్, ఎస్పీ శివ, సర్పంచ్ గీత వీరేశం, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, యుగంధర్, జూపల్లి శంకర్, కానుగు అంతయ్య, నంద కిషోర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, లంకాల రాఘవేందర్ రెడ్డి, మల్లేష్, భువనేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు**

ఉద్యమకారుడు,నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ,తెలంగాణ ఉద్యమంలోనూ, ప్రజాసేవలోనూ పెద్ది సుదర్శన్ రెడ్డి విశేష సేవలు అందించిన నాయకుడని కొనియాడారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీతో పాటు నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు కూడా తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కేటీఆర్‌తో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

## ఫార్ములా ఈ కార్ రేస్‌పై కక్షసాధింపు తగదు

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** పార్ములా లాఈ కార్ అక్రమ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యే ముందు,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన కోకాపేట నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు ఈ భేటీలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్షసాధింపు చర్యలతో ఈ అక్రమ కేసు పెట్టిందని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచవ్యాప్తంగా పెంచేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ అంతర్జాతీయ రేస్‌ను నిర్వహిస్తే,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై అసత్య ఆరోపణలు చేస్తూ కేటీఆర్ పై తప్పుడు కేసులు మోపిందని బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి దీనిని రాజకీయంగా, న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలో అధిష్టానం కి తెలుసని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తెలిపారు.ఈ భేటీ అనంతరం నేతలందరితో కలిసి కేటీఆర్ నాంపల్లి కోర్టుకు బయలుదేరి వెళ్లారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**శంషాబాద్, జులై 31, ప్రభాతవార్త :**

ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఛార్జింగ్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది.మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండగా, భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు.ప్రాథమిక విచారణలో అనారోగ్యం లేదా సరైన ఆహారం తీసుకోకపోవడం వల్లే ఆయన మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌ఓ సంజీవ్ పేర్కొన్నారు.మృతుడిని ఎవరైనా గుర్తించినా లేదా ఆయనకు సంబంధించిన వివరాలు తెలిసినా ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712663319ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## "సేఫ్ స్పోర్ట్స్" తెలంగాణపై అవగాహన




మేడ్చల్ జిల్లాలోని హకీంపేట్ తెలంగాణ క్రీడాపాఠశాలలో "సేఫ్ స్పోర్ట్స్" తెలంగాణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 31, ప్రభాతవార్త:**

స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో "సేఫ్ స్పోర్ట్స్" తెలంగాణపై హకీంపేట్‌లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా హకీంపేట్‌లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో సేఫ్ స్పోర్ట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని క్రీడాకారులకు (విద్యార్థులకు) నిర్వహించారు. తెలంగాణ క్రీడా విధానం-2025లో భాగంగా క్రీడాకారులకు సురక్షితమైన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (ఎస్ఎటిజి) ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని క్రీడా వ్యవస్థలో సమగ్ర సేఫ్ గార్డింగ్ పాలసీ అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగ బాలికలకు, మహిళా క్రీడాకారుల భద్రతతో కూడిన వాతావరణంలో తమ ప్రతిభను పూర్తి స్థాయిలో ప్రదర్శించేందుకు అవసరమైన అవగాహన కల్పించే ఉద్దేశంతో సేఫ్ స్పోర్ట్స్ తెలంగాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా యునెస్కోకు చెందిన శ్రద్దా చిక్కెరూర్, యుగాంతర్ సంస్థకు చెందిన తేజస్విని మాదభూషి విద్యార్థులతో ప్రత్యేకంగా మమేకమై సేఫ్‌గార్డింగ్ ఇన్ స్పోర్ట్స్ వ్యక్తి గత భద్రత, ఏ విధమైన వేధింపులు లేదా దుర్వినియోగం జరిగినా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ అనిత, హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ మమత, పిఆర్ఓ సురేశ్ కాలేరు,పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సిపిఓగా జగన్ బాధ్యతలు

..జిల్లా కలెక్టర్ మనుచౌదరిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన సిపిఓ జగన్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 31, ప్రభాతవార్త:**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ)గా ఎన్.జగన్ నియమితులై బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ముందుగా జిల్లా కలెక్టర్ మనుచౌదరిని ఛాంబర్‌లో జిల్లా నూతన సిపిఓ ఎన్ జగన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కలెక్టరేట్‌లోని సిపిఓ కార్యాలయంలో సిపిఓగా నియమితులైన ఎన్ జగన్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి సిపిఓగా ఉన్న అధికారి రిలీవ్ అయ్యారు. జిల్లా నూతన సిపిఓగా జగన్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ మనుచౌదరిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా నూతన ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ) ఎన్.జగన్ దృశ్యం

# ఆర్థిక స్వావలంబనకు ఆక్వాకల్చర్ గొప్ప అవకాశం

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** చేవెళ్ల ఎంపీ శ్రీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, షాద్‌నగర్ ఇంచార్జ్ అందె బాబన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజ్, బెస్త సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చేపల పెంపక ప్రోత్సాహక కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో అమలవుతున్న బ్లూ రివల్యూషన్ (నీలి విప్లవం) ద్వారా ఆక్వాకల్చర్ రంగం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతూ వేలాది కుటుంబాలకు ఉపాధి, ఆదాయం కల్పిస్తోందని ఎంపీ తెలిపారు. ప్రత్యేకంగా ఆక్వాకల్చర్, అక్వేరియం రంగంపై కొండ విశ్వేశ్వర్ రెడ్డికి ఉన్న లోతైన అవగాహన, పరిశోధనాత్మక దృక్పథం మాకు ఎంతో ఆకట్టుకుంది. ఆయన స్వయంగా ఎంతో శ్రద్ధతో అద్భుతమైన అక్వేరియంను తయారు చేయడం ద్వారా ఈ రంగంపై ఎంత ప్రాయోగిక జ్ఞానం, ఆసక్తి కలిగి ఉన్నారో స్పష్టమైంది. భవిష్యత్తులో అక్వాకల్చర్, అక్వేరియం రంగాల్లో అపారమైన వ్యాపార అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా యువత, ముదిరాజ్, బెస్త వంటి వృత్తి ఆధారిత సామాజిక వర్గాలు ఈ రంగంలో ముందుకు వస్తే ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని ఆయన వివరించిన తీరు ఎంతో ప్రేరణనిచ్చింది.చిన్న రైతులు, వృత్తిదారులు తమ ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలాలు, పెరట్లు లేదా తోటల్లో చిన్న స్థాయి చేపల పెంపక యూనిట్లు ఏర్పాటు చేసి తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలపై కూడా సమగ్ర అవగాహన కల్పించారు.ఈ రంగంపై కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు చేసిన అధ్యయనం, సాంకేతిక అవగాహన, భవిష్యత్ అవకాశాలపై ఆయన చూపుతున్న దూరదృష్టి నిజంగా అభినందనీయం. కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, కొత్త ఉపాధి మార్గాలను గుర్తించి సమాజానికి దారి చూపించే విజన్ కలిగిన నాయకుడిగా ఆయన నిలుస్తున్నారు. ఆయన చెప్పిన ప్రతి అంశం భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండటం మాకు ఎంతో ఆనందం కలిగించింది.ఆక్వాకల్చర్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, వీడియోలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. ముదిరాజ్, బెస్త సామాజిక వర్గాల ఆర్థిక బలోపేతానికి ఆక్వాకల్చర్ ఒక శాశ్వత ఉపాధి, స్థిరమైన ఆదాయం అందించే గొప్ప అవకాశంగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన అందె బాబయ్య శ్రీవర్ధన్ రెడ్డి

# అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల రెండు తరాల అపూర్వ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం షాద్‌నగర్ బ్లాక్ ఆఫీస్ ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద స్థానిక ఉద్యమకారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు న్యాయమైన హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు అందేలా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం ఈ శతాబ్దంలోనే అతిపెద్ద ప్రజా ఉద్యమమని పేర్కొన్న ఆయన, ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వేలాది మంది ఉద్యమకారులు ఇప్పటికీ సరైన గుర్తింపు, గౌరవం పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొద్దిమందికే అవకాశాలు లభించాయని, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నాయకులు, కార్మికులు, ఉద్యమకారులు తగిన గుర్తింపు పొందలేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. అయితే పోలీసు కేసులు లేని అనేక మంది నిజమైన ఉద్యమకారులు గుర్తింపుకు దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉద్యమ కారులందరూ సంఘటితమై తమ హక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.ప్రధాన డిమాండ్లు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలి. ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలి. ఉద్యమకారులకు అధికారిక గుర్తింపుకార్డులు జారీ చేయాలి. ఉద్యమకారులకు పింఛన్ మంజూరు చేయాలి. ఈ నాలుగు ప్రధాన డిమాండ్ల సాధనకోసం సెప్టెంబర్ 16న జరిగే సమ్మేళనానికి తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఉద్యమ కారుడు హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి, కౌన్సిలర్ దిలీప్ కుమార్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బొర్రెల్లి సురేష్, ఓయూ జేఏసీ నేత రహీమ్, విద్యార్థి నేత జాంగారి రవి, ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నడికూడ యాదగిరి యాదవ్, ఆర్ల యాదయ్య యాదవ్, మేకల వెంకటేష్, అదేల్ల రాజు, రవికుమార్ గౌడ్, బీరప్ప, కుదుముల మల్లేష్, మహేందర్, మైలారం విశాల్ తదితరులు పాల్గొన్నారు.



అమరుల స్తూపం వద్ద సమ్మేళనం గోడపత్రిక విడుదల చేస్తున్న ఉద్యమకారులు

# తండాల్లో గిరిజనుల ఇళ్లకు విద్యుత్ మీటర్లు

..టిజిఎస్ పిడిసిఎల్ జిల్లా ఎస్ఇ జ్ఞానేశ్వర్

**శామీర్‌పేట, జులై 31, ప్రభాతవార్త:**

సేవాలాల్ మల్లన్న తండాలో నివసిస్తున్న గిరిజన కుటుంబాల వారి ఇళ్లకు విద్యుత్ మీటర్లను విద్యుత్ అధికారులు (ఏర్పాటు) పంపిణీ చేసినట్లు టిజిఎస్ పిడిసిఎల్ మేడ్చల్ జిల్లా విద్యుత్ ఎస్ఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్‌లోని సేవాలాల్ మల్లన్న గిరిజన తండా కాలనీలో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాల వారి ఇళ్లకు విద్యుత్ మీటర్లను జిల్లా విద్యుత్ ఎస్ఈ జ్ఞానేశ్వర్, పలువురు విద్యుత్ అధికారులు పాల్గొని మీటర్లను ఏర్పాటు (పంపిణీ) చేశారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలతో స్థానికంగ ఉంటున్న వారికి 40విద్యుత్ మీటర్లు పంపిణీ చేసి కనెక్షన్స్ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ సేవాలాల్ తండలో నివసిస్తున్న వారికి విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ఆ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పూల్సనింగ్ గతంలో కోరటం జరిగిందన్నారు. కొత్త విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ధరఖాస్తు పెట్టుకున్నారని అన్నారు. ఈ విషయంపై ఎస్టీ కమిషన్‌ను వారు ఆశ్రయించినట్లు, దీంతో ఎస్టీ కమిషన్ వారు గుర్తించి స్థానికంగ నివాసం ఉంటున్న వారికి విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. ఎస్టీ కమిషన్ ఆదేశాలతో నూతనంగా విద్యుత్ మీటర్లు మంజూరు చేశామని ఆయన అన్నారు. విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి కనెక్షన్స్ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డివిజనల్ ఇంజనీర్ జాన్ పోతరాజు, శామీర్‌పేట విద్యుత్ ఎడిఈ శ్రీనివాస్, శామీర్‌పేట సెక్షన్ ఎఇ విజయకుమార్, గిరిజన కాలనీ అధ్యక్షులు పూల్సనింగ్ నాయక్, గిరిజనులు, విద్యుత్ సిబ్బంది తదితరులు



దేవరయాంజాల్‌లోని సేవాలాల్ మల్లన్న గిరిజన తండావాసులకు విద్యుత్ మీటర్లు (ఏర్పాటు) పంపిణీ చేసి పాల్గొన్న విద్యుత్ ఎస్ఇ జ్ఞానేశ్వర్, అధికారుల దృశ్యం

# సూరారంలో 280 గ్రాముల గంజాయి స్వాధీనం..




పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

**జీడిమెట్ల, జులై 31, ప్రభాతవార్త :** సూరారం పోలీసులు ఎస్ఓటీ కూకట్‌పల్లి బృందంతో కలిసి నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 280 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, ఎం.డి. సలీమ్ అలియాస్ గుడ్డు శర్మ (45), ఖైసర్‌నగర్‌కు చెందిన వాచ్‌మెన్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 280 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపింది.పోలీసుల విచారణలో నిందితుడు అలవాటుగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గతంలో కూడా అతనిపై నాలుగు ఎన్‌డీపీఎస్ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.ఈ విజయవంతమైన ఆపరేషన్‌లో పాల్గొన్న సూరారం పోలీసు బృందాన్ని సూరారం ఎస్‌హెచ్‌ఓ కె. బాలరాజు అభినందించారు.

## చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**రాజ్యసభలో ఆర్.కృష్ణయ్య డిమాండ్**

**హైదరాబాద్, జులై 31, ( ప్రభాతవార్త ) :** చట్టసభల్లో వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకుగానూ చట్టసభలు, పార్లమెంట్‌లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ తక్షణమే బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజ్యసభలో ఆయన బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, ఎదుర్కొంటున్న అసమానతలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... దేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్లు, పంచాయతీరాజ్ సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు అమలులో ఉన్నప్పటికీ, శాసనసభలు మరియు పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పురోగతించకపోవడం తీవ్ర వివక్షకు, అన్యాయానికి గురిచేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నాయని, చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక బిల్లు తెచ్చిన కేంద్రం.. దేశంలో మెజారిటీ వర్గమైన బీసీలను మాత్రం విస్మరిస్తోందని పేర్కొన్నారు. ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు: రాష్ట్రాల అసెంబ్లీ తీర్మానాలు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ శాసనసభలు 1996, 2008, 2010, 2014 సంవత్సరాల్లో చట్టసభల్లో బీసీలకు 50 రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి కేంద్రానికి పంపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు.ప్రాతినిధ్యం లేని కులాలు: దేశవ్యాప్తంగా ఉన్న 2,646 ఓబీసీ కులాలలో దాదాపు 2,550 కులాలకు చెందిన ప్రతినిధి ఒక్కరు కూడా ఇప్పటివరకు పార్లమెంట్ గుమ్మం తొక్కలేదని, 29 రాష్ట్రాల్లోని 11 రాష్ట్రాల నుంచి నేటికీ ఒక్క ఓబీసీ ఎంపీ కూడా ఎన్నుకోబడకపోవడం ప్రజాస్వామ్యానికే మచ్చ అని అన్నారు.జనాభాకు తగ్గ వాటా: దేశ జనాభాలో సుమారు 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు పార్లమెంట్‌లో కనీసం 14 శాతం ప్రాతినిధ్యం కూడా లభించడం లేదని, స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తవుతున్నా శ్రమజీవులైన బీసీలకు రాజకీయ అధికారం దక్కకపోవడం శోచనీయమన్నారు.హక్కుభిక్ష కాదు: బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు ఏ ప్రభుత్వాల భిక్ష కాదని, అది రాజ్యాంగబద్ధంగా సంక్రమించాల్సిన ప్రజాస్వామ్య హక్కు అని స్పష్టం చేశారు. అధికారం లభిస్తేనే సామాజిక గౌరవం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, అసమానతలు తొలిగి ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. దేశంలోని సంపదను సృష్టిస్తున్న వెనుకబడిన వర్గాలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా చట్టసభల్లో స్థానం కల్పించినప్పుడే భారత్ నిజమైన ప్రజాస్వామ్య గణతంత్రంగా వర్ధిల్లుతుందని పేర్కొంటూ, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ వర్షకాల సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు .

## గానసభలో మువ్వల సందడిగా గురుపౌర్ణమి వేడుకలు

**చిక్కడపల్లి జులై 31 ( ప్రభాతవార్త ) :** బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై గురుపౌర్ణమిని పురస్కరించుకుని "మువ్వల సందడి" పేరిట నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్య గురువులు టి.వి. జయశ్రీ, ఆనందమయి, భరతనాట్య గురువు స్నేహప్రియల శిష్య బృందాలు (సుమారు 50 మందికి పైగా కళాకారులు) అన్నమయ్య, త్యాగయ్య, భక్తరామదాసు కీర్తనలకు అనుగుణంగా చేసిన నాట్య ప్రదర్శనలు మైమరిపించాయి. సంగీత గురువు మల్లాది విజయలక్ష్మి శిష్య బృందం ఆలపించిన గానం సభను రంజింపజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ మాట్లాడుతూ కేవలం పుస్తక పాఠాలు బోధించే వారే గురువులు కారని, వివిధ కళా ప్రక్రియలలో శిక్షణ ఇచ్చి సమాజానికి ఉత్తమ కళాకారులను అందించే వారు కూడా గొప్ప గురువులే" అని కొనియాడారు. గురుపౌర్ణమి సందర్భంగా అలాంటి గురువులను సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. మాజీ కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డి, సామాజిక సేవకుడు మెడిది వెంకటేశ్వరరావు, అనాథ సేవా సంస్థ ప్రతినిధి అను పులిపాక, రచయిత్రి శాంతిలక్ష్మి, పి.వి.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు విక్కీ మాస్టర్ నిర్వహణలో పాల్గొన్న కళాకారులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని విస్మరించిన కాంగ్రెస్

**బిఆర్ఎస్ ఆగ్రహం**

**చిక్కడపల్లి, జులై 31, ( ప్రభాతవార్త ) :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి పూర్తిగా మొండిచేయి చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను మరోసారి మోసం చేసిందని తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. శుక్రవారం రాంనగర్ లో తెలంగాణ ఉద్యమకారులు, బి ఆర్ ఎస్ సీనియర్ నేత రేషం మల్లేష్ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతి పేద కుటుంబానికి ఉచిత ఇల్లు అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని ఆరోపించారు. ముషీరాబాద్ నియోజకవర్గాన్ని ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తూ, పేదల ఆశలపై నీళ్లు చల్లిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో రూ.6 లక్షల లబ్ధిదారుల వాటా, రూ.10 వేల దరఖాస్తు రుసుము విధించడం వల్ల ఈ పథకం నిజమైన పేదలకు అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు. పేదలకు ఉచిత ఇళ్లు ఇస్తామన్న హామీని భారంగా మార్చి, వారి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం ఛిద్రం చేసిందని అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ ప్రదర్శనలకే పరిమితమయ్యారని, నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి 360 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిగా ఉచితంగా అందించామని, అదే పేదల పట్ల తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కాదు, చేతల్లో చిత్తశుద్ధి చూపించి ముషీరాబాద్‌లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు కల్వ గోపి, నేత శ్రీనివాస్, అజయ్ ముదిరాజ్, చిట్టి శ్యాంసుందర్, సిరిగిరి శ్యామ్, పున్న సత్యనారాయణ, బండా యుగేందర్, కొండ మాధవ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు వస్తువుల పంపిణీ

**చిక్కడపల్లి జులై 31 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థినులకు వివిధ రకాల సౌకర్యాల నిమిత్తం వస్తువుల పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి జి. కాంతమ్మ విశిష్ట అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కళాశాలలో నెలకొన్న క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యావాతావరణాన్ని అభినందించారు. విద్యార్థినులు నీట్, జేఈఈ, సివిల్ సర్వీసెస్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి జి. కాంతమ్మ మాట్లాడుతూ తెలంగాణ మైనార్టీ సంక్షేమ నివాస విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఐపీఈ-202526లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అతిథులు జ్ఞాపికలతో సన్మానించారు.

## మహిళ ముందు అసభ్య ప్రవర్తన

**జూబ్లీహిల్స్, జులై 31, ప్రభాతవార్త:**

బోరబండలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అజాం నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్న మహిళ ఇంటి ముందు అదే ప్రాంతానికి చెందిన అద్దెదారు పొన్నాల రాజేందర్ టవల్ ధరించి నిల్చున్నాడు. టవల్ తొలగించి మహిళ వైపు తన మర్మాంగాలను ప్రదర్శించాడు. దీంతో ఆమె తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది. గతంలోనూ సదరు వ్యక్తి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, ఈ విషయాన్ని భర్తకు చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని రాజేందర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## అర్ధరాత్రి సంచరిస్తున్న ఇద్దరికి జైలు

**చాంద్రాయణగుట్ట, జులై 31, ప్రభాతవార్త :** అర్ధరాత్రి వేళ అను మానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులకు కోర్టు ఐదు రోజుల జైలుశిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిందర్ తెలిపిన వివరాల ప్రకారం... పెట్రోలింగ్ సిబ్బంది రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ముఖానికి ముసుగు వేసుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని అడ్డగించి వారి వివరాలు అడుగగా పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆటోడ్రైవర్ మహ్మద్ ఇర్ఫాన్ (28), కూలీ పనిచేసే మహదేవ (25)లుగా గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం నాంపల్లిలోని 9వ స్పెషల్ జ్యుడిషల్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరు పరిచారు.

# ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు అజైల్ వర్క్స్ ఇవ్వాలి

**చిక్కడపల్లి, జులై 31, ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్రంలో క్లాస్-2, క్లాస్-3 ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు కూడా అజైల్ వర్క్స్ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. మాజిద్ కోరారు. శుక్రవారం ఎస్.కే. మాజిద్ ఆధ్వర్యంలో పలువురు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు విద్యుత్ సంస్థ సీఎండీ, చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్)లను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా క్లాస్-2, క్లాస్-3 కాంట్రాక్టర్లకు సమాన అవకాశాలు కల్పించి అజైల్ వర్క్స్ కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ, అన్ని సర్కిళ్ల పరిధిలోని సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) క్లాస్-2, క్లాస్-3 కాంట్రాక్టర్లకు పనులు కేటాయించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్) కార్యాలయానికి ప్రతిపాదనలు పంపితే వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని సర్కిళ్లకు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు తమ తమ సూపరింటెండింగ్ ఇంజనీర్లను కలిసి క్లాస్-2, క్లాస్-3 కాంట్రాక్టర్లకు అజైల్ వర్క్స్ కేటాయించేలా సిఫారసు లేఖలను చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్)కు పంపించాలని ఎస్.కే. మాజిద్ కోరారు.క్లాస్-2, క్లాస్-3 కాంట్రాక్టర్లకు తగిన అవకాశాలు కల్పించే వరకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**PUBLIC NOTICE**

Under the specific instructions of our client namely **Chakrahari Harshavardhana Raju** S/o Jayaramanuja Raju, R/o H.No. 2-13, Guttala Begumpet, Madhapur, Shaikpet, Hyderabad-500081, I hereby issue this public notice to all the general public as under:

That my client states he is intending to purchase the agricultural land admeasuring Ac. 0-33 Gts bearing Sy no. 72/ RU 4/1/1/2, 72/ RU 3/1/2, 72/LU5 /1, 72/RUU 3/AA/2/1 and 72/AA 5/1 situated at Bakaram Jagir Village, Moinabad Mandal, Ranga Reddy District bounded by NORTH : others Sy.No 72 of Kavali Eswaraiah, SOUTH : Land of Shalini Reddy, EAST : others Sy.No 72 of Kavali Gopal and WEST : others Bakaram Jagir Village Main road from Sri Sai Prashanth Pinnamaneni who is the absolute owner and possessor of the above mentioned property and he is in possession of said land as on today and having pattadar pass book and title deeds as per the Government of Telangana.

My client further states that he has already paid part of sale consideration amount to his vendor as advance amount and going for registration of sale deed within short span of time as such any person or persons having any kind of intrest or rights or objections or claims over the above mentioned land may submit your objections along with necessary documents to our counsels within 7 days from the date of publication of this notice otherwise it is deemed to believed that my client's vendor is having perfect marketable title with respect to his property and no claims or objections will be entertained after 7 days. This is for information of all the general public.

**R. Balasubrahmanyam**
**B. Vinodhar**
**Advocates**

**Office address:** #Chamber No.431, 4th Floor, Sri Lakshmi White House H & T Shopping Complex, Doctors Colony, Saroornagar, Ranga Reddy Dist-35. **Cell No: 9948125551**


డిప్యూటీ కమిషనర్ సుదాంష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

## రోడ్డు సరిచేయాలని ముదిరాజ్ సంఘం నాయకుల వినతి

**మేడ్చల్, జులై 31, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణం కిందిబస్తీలో నల్లపోచమ్మ ఆలయ బోనాల పండుగ ఉన్నందున కింది బస్తీ రోడ్డు బాగు చేయాలని ముదిరాజ్ సంఘం సభ్యులు మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆలయానికి వెళ్లే రోడ్డులో ఇటీవల డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టడంతో మట్టితో రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండి నడవడానికి ఇబ్బందిగా ఉందని వినతిలో పేర్కొన్నారు. ఈ నెల 6న నల్లపోచమ్మ బోనాలు పండుగ ఉన్నందున భక్తులు వెళ్లడానికి, బోనాలు తీసుకెళ్లడానికి రోడ్డులో వీలు లేకుండా ఉందని వెంటనే చేపల మార్కెట్ నుండి ఆలయం వరకు రోడ్డును వేయించి ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు రామస్వామి, సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జలమే జీవం -ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి


నందిగామ 6వ వార్డ్ లో బోరు బావికి మోటర్ బిగించిన పారిశుద్ధ సిబ్బంది.

**నందిగామ, జులై 31, ప్రభాతవార్త :** జలమే జీవమని.. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పడితేనే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం నందిగామ మండల కేంద్రంలో 6వ వార్డ్‌లో మంచినీటి బోరుబావికి మోటర్ బిగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ఎఫెక్ట్ ను తట్టుకోవాలంటే ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకునేలా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు శివగల్ల ప్రవీణ్, శివవగళ్ల సురేష్, శంకర్, నాయకులు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్ర, ఎర్రగారి రమేష్ ,అభిరాం, కొమ్ము సాయి, యాదయ్య, నరేష్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్

**కుల్కచర్ల, జులై 31,ప్రభాతవార్త :** అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెరువుముందలి తాండ(ఎ) గ్రామ పంచాయతీలో స్థానికనాయకులతో కలిసి పలు అంశాలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..ఆర్థిక సంవత్స రం లో పలు అభివృద్ధి జరిగినట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరుసహకరించాలని కోరారు. అందరి సహకారంతోనే గ్రామ అభివృద్ధి జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లలిత, ఫిల్డ్అసిస్టెంట్ చంద్రమౌళి,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీటికి సమస్యకు పరిష్కారం

**కుల్కచర్ల, జులై 31, ప్రభాతవార్త:** గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ మాధవి అన్నారు. శుక్రవారం మండల పరిధలోని తిరులపూర్ గ్రామ పరిధిలో ప్రజలకు తాగు నీటి సమస్యఉందని సర్పంచ్ మాధవి, ఉప సర్పంచ్ శివకుమార్ దృష్టికి


నూతన బోరు వేయిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

రావడంతో వెంటనే స్పందించి నూత బోరు వెయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామ సమస్యల పరిష్కరానికి నిరంతం కృషి చేస్తామని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం

**మేడ్చల్, జులై 31, ప్రభాతవార్త :** మేడ్చల్ మండల పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఎంఆర్ సెట్)లో 2026-2027 విద్యా సంవత్సర విద్యార్థుల కౌన్సిల్ ఇన్వెస్టిచర్ (ప్రమాణ స్వీకార) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన నూతన విద్యార్థి మండలి సభ్యులు తమ తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. వారికి గుర్తింపు కార్డులు, హోదాకు ప్రతీకలైన గుర్తులను అందజేసి నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమానికి సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అభినవ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత సేవాభావం, క్రమశిక్షణ, సమాజానికి సేవ చేసే తత్వం వంటి అంశాలపై ఆయన విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కళాశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**కొడంగల్,జులై 31,ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి మొక్కలను నాటాలని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్మేన్ కొడంగల్‌లో మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతి



కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సం రక్షించాలని ఆయన పిలుపునిచ్చారు.మొక్కలు నాటడం ద్వారా పచ్చ దనాన్ని పెంపొందించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించ వచ్చని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని,ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మెప్మ సీసీలు ఆనందబ్బ తదితరులు పాల్గొన్నారు.

# గుండ్లపోచంపల్లిలోని సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే మల్లారెడ్డికి మేడ్చల్ బిఆర్ఎస్ నేతల వినతి

**మేడ్చల్, జులై 31, ప్రభాతవార్త:** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కంచాలని కోరుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డికి బిఆర్ఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ పట్టణం పారిశుధ్య లోపం నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా జాతీయ రహదారి ఇరు పక్కన, బస్ డిపో ప్రాంగణం దుర్గంధంగా మారాయని వినతిలో పేర్కొన్నారు. అదేవిదంగా గుండ్లపోచంపల్లితో పాటు డివిజన్‌లల్లోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ఈ సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, నవీన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

# సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధిక దిగుబడులు


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు రమాదేవి

**కేశంపేట, జులై 31 ,ప్రభాతవార్త :** పంటల సాగులో అధిక దిగుబడులు రావాలంటే యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని ఏది రమాదేవి అన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని ఆల్వాల, కేశంపేట, వేములనర్వ గ్రామాలలో సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మొక్కజొన్న పంటలో నీరు నిల్వ ఉండకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, కాండం తొలిచే పురుగు, ఫాల్ ఆర్మీవార్మ్ ఉధృతిని తరచూ పరిశీలించాలని సూచించారు. అవసరమైతే ఎమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జి 0.4 గ్రా./లీటర్ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ 0.4 మి.లీ./లీటర్ లేదా స్పినెటోరామ్ 11.7 ఎస్‌సి 0.5 మి.లీ./లీటర్ పిచికారీ చేయాలని తెలిపారు. కలుపు మొక్కలను తొలగించి, అవసరమైతే యూరియా టాప్ డ్రెస్సింగ్ చేయాలని, జింక్ లోపం కనిపిస్తే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలని సూచించారు.పత్తి పంటలో అధిక వర్షాల కారణంగా నీరు నిల్వకాకుండా చూడాలని, తెల్లదోమ, తామర పురుగు, గులాబీ రంగు పురుగు ఉధృతిని నిరంతరం గమనించాలని చెప్పారు. తెల్లదోమ నివారణకు ఫ్లోనికామిడ్ 50 జూబి లేదా డైనోటెఫ్యూరాన్ 20ఎస్‌జి, తామర పురుగు నివారణకు థియామెథోక్సామ్ 25 జూబి, గులాబీ రంగు పురుగు నివారణకు ఫెరోమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేసి అవసరమైతే ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారీ చేయాలని సూచించారు. పసుపు స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు చేసి సమతుల్య ఎరువుల నిర్వహణ పాటించాలని, అవసరం లేకుండా పురుగుమందులు పిచికారీ చేయరాదని తెలిపారు.మిర్చి పంటలో నీటి నిల్వను నివారించి త్రిప్స్, తెల్లదోమ, తామర పురుగుల ఉధృతిని గమనించాలని, ఆకుమచ్చ, కాయకుళ్లు వంటి శిలీంధ్ర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే స్పినెటోరామ్ లేదా స్పినోసాడ్, ఫ్లోనికామిడ్, అలాగే అజోక్సిస్ట్రోబిన్ + డైఫెనోకోనాజోల్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలని, దెబ్బతిన్న మొక్కలు, కొమ్మలను తొలగించాలని తెలిపారు.కంది పంటలో నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, కాయ తొలిచే పురుగు, మరుక పురుగు ఉధృతిని గమనించాలని సూచించారు. అవసరమైతే ఎమామెక్టిన్ బెంజోయేట్, క్లోరాంట్రానిలిప్రోల్ లేదా ఇండోక్సాకార్బ్‌ను సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించాలని, కలుపు మొక్కలను సకాలంలో తొలగించి పుష్పించే దశలో తేమ కొరత లేకుండా చూసుకోవాలని తెలిపారు.

ఈ సందర్భంగా రైతులు పంటలను ప్రతిరోజూ పరిశీలిస్తూ పురుగులు, వ్యాధులు ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ శ్రీమతి రామాదేవి గారు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామశివ రావు, ఏ ఈ ఓ వినయ్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


నంది వనపర్తి ఉచిత వైద్య శిబిరంలో ఆస్పత్రి బృందం ప్రజా ప్రతినిధులు

## నందివనపర్తిలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**యాచారం జులై31, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో మాధవంజి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫౌండర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నెదర్లాండ్‌కు చెందిన ప్రతినిధి బృందం విశిష్ట అతిథులుగా హాజరై సేవలు అందించినందుకు గ్రామ ప్రజాప్రతినిధులు ప్రజలు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్ అతిథులకు ఘన స్వాగతంపలికి కార్యక్రమంలో పాల్గొన్నారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మాధవంజి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫౌండర్, నందివనపర్తి గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను అందించేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం,గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన ఈసీఐ కార్యదర్శి

**కీసర,జులై31,ప్రభాతవార్త:**
కీసర సర్కిల్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలోని 174,175 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్‌కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సమీక్షించారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు,ఇంటింటి సర్వే,ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ,డిజిటలైజేషన్ పురోగతి,పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి సంబందిత అధికారులతో చర్చించారు.ఆగస్టు 3వ తేదీలోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేసి వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు.పోలింగ్ కేంద్రం 175లో మొత్తం 598 మంది ఓటర్లకు గాను 538 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.మిగిలిన 60 ఫారాల్లో 27 మంది ఇతర ప్రాంతాలకు మారగ,18 మంది మృతి చెందినట్లు,13 మంది డబుల్ నమోదులు,ఇద్దరు గైర్హాజరుగా గుర్తించినట్లు వివరించారు.పోలింగ్ కేంద్రం 174లో మొత్తం 998 మంది ఓటరకు గాను 843 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజ్ చేయగా,155 ఫారాలు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు.వాటిలో 90 మంది ఇతర ప్రాంతాలకు మారడం,31 మంది మృతి చెందడం,34 మంది డబుల్ నమోదు కేసులుగా గుర్తించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 88.92 శాతానికి చేరినట్లు ఆర్‌డిఓ,ఈఆర్ఓ నల్ల వెంకట్‌రెడ్డి ఈసీఐ కార్యదర్శికి వివరించారు.నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరుని జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఈసీఐ కార్యదర్శి నవీన్‌కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,ఆర్‌డిఓ నల్ల వెంకట్‌రెడ్డి,తహశీల్దార్ యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుక్కమ్మకు నేతల నివాళి

పట్నం సోదరులను పరామర్శించిన పలువురు నేతలు

**షాబాద్, జులై31, ప్రభాతవార్త :** శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతిపట్ల పలువురు నేతలు సంతావం తెలిపారు. శుక్రవారం షాబాద్లోని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ పామైన భీందరత్, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డీసీసీ ప్రధానకార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సలీంపాష, మండల అధ్యక్షుడు దర్పల్లి రవీందర్ గౌడ్, జర్నలిస్టుల సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, వివిధ గ్రామాల సర్పంచులు వారిని పరామర్శించి రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి, తన ప్రగాఢసానుభూతి తెలిపారు.



## సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలి

**షాబాద్, జులై31, ప్రభాతవార్త :** సీజన్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండ్యపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడివో అవర్ణ అధ్యక్షతన మండల ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

చైర్మన్ కావలి చంద్రశేఖర్లతో కలిసి మం డల స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సందర్బంగా మదుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు గ్రామాల్లో సీజన్ వ్యాదులపై దృష్టి పెట్టాలన్నారు. వర్షాల కారణ గా ప్రజలు అవసరమైతే తప్ప బయటకి రావద్దని కోరారు. ఎలినినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల నేపద్యంలో భూగర్భజలాలను పెంపొందించేందుకు చేపట్టాల్సి న చర్యలను వివరించారు. వర్షపు నీటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియచేస్తూ ఇంకుడు గుంతలు, పామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు గ్రామ గ్రామంలో నీటిని సంరక్షణ చేసి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు ప్రజలందరకు ప్రభుత్వానికి వారదిగా ఉంటూ తమ విధినిర్వహణలో నిరక్ష్యం వహించకుండా ఉండాలన్నారు .పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామపంచాయితీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిల్పివో సతీష్ రెడ్డి ఏదో విజయచంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రణీత్, ఏఈఒలు హరిక, కీర్తికృష్ణ. ఏపీవో వీరాసింగ్ ఏపీఎం నరేందర్ రెడ్డి, అంగన్వాణి నూనె గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ. ఆర్‌ను పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్

**షాబాద్, జులై31, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోయి, అర్హులైన వారందరికి అందేలా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజూ భూపాల్ గౌడ్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రపంచ దేశాలు మొత్తం భారత్ వైపు చూస్తున్నాయని అన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త అధికారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ లో అర్హులైన ఒటరు కూడా ఒక్క ఓటు కోల్పోవద్దని. గడువు సమీపిస్తుండడంతో ఓటరుగా పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు బీఎల్ వోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య, నాయకులు రాము. హరీష్, మహేష్ మహేందర్. సర్పంచ్ బందయ్య, మాజీ వెంపటిని వనిత, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్ర ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు

**మోమిన్‌పేట్,జులై 31. ప్రభాతవార్త:** మన చంద్ర ఫౌండేషన్ ద్వారా గ్రామాలలో నిరుపేదలైన మహిళలకు, గర్భిణీ స్త్రీలు, నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యా, మరియు వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని మన చంద్ర ఫౌండేషన్ చైర్మెన్, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ కూతురు డాక్టర్ చంద్ర ప్రియ అన్నారు.

శుక్రవారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం మన చంద్ర ఫైండేషన్ సభ్యులు పులిగారి వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు చంద్రప్రియను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతు గ్రామంలో నిరుపేద మహిళలకు, దీర్ఘకాలిక రోగులకు, గర్భిణీలకు, విధ్యార్థులకు అవసరమైనటువంటి సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే నియోజక వర్గ పరిధిలోని గ్రామ గ్రామాన పర్యటించి ప్రజలయొక్క బాగోగులు తెలుసుకొని మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బుదారపు బుచ్చిరెడ్డి, పులిగారి వెంకటయ్య, కుమ్మరి అశోక్, వడ్ల మాణిక్యం, ఎక్బాల్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

## అనారోగ్యంతో ఉండి సర్వసభ్య సమావేశానికి హాజరైన శాసనసభ్యులు

**యాచారం,జులై 31, ప్రభాతవార్త :**
మంత్రి పదవి ఇవ్వకున్నా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి కోసం అడిగినన్నీ నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేస్తున్నారని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో 24 గ్రామ పంచాయతీల సర్పంచులు వివిధ శాఖల అధికారులు, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఏసిపి కెపివి రాజు, మండల ప్రత్యేక అధికారి మాధవరావు, తాసిల్దార్ అయ్యప్ప,ఎంపీడీవో రాధా రాణి లతో కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులతో మొదలైన చర్చ అంశాలు ప్రారంభించారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామాలలో అభివృద్ధి పనులలో జాప్యం జరుగుతుందని కాంట్రాక్టర్లు నిరక్ష ్యంతో ఉన్నారని తమ గోడు విన్నపించారు.అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ నాణ్యమైన పనుల కోసం తను ఎల్లప్పుడూ ముందుంటానని నాణ్యత తగ్గిస్తే ఎవరిని ఉపేక్షి ంచేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచులందరూ బాధ్యతగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచన చేశారు. పార్టీలకతీతంగా అందరూ గ్రామాలలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ సర్పంచులు గ్రామ కార్యదర్శులు అందరూ ప్రజలతో సమన్వయంతో పని చేయాలని సూచన చేశారు.ఫార్మసిటి భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించేందుకు తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తు చేశారు. గతవారం ఫార్మసిటి భూనిర్వశితుల సమస్యలపై జిల్లా మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమై కలెక్టర్లతో విషయాలు చర్చించడం రైతులకు ఆయా గ్రామాల సర్పంచ్లకు తెలిసిందేనని సానుకూలంగా స్పందించిన మంత్రి కలెక్టర్లు న్యాయం జరిగేలా చేస్తారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


గీతాంజలి కళశాలలో జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న లేఖ శిష్టకి బహుమతిని అందజేస్తున్న దృశ్యం

## గీతాంజలి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

**కీసర, జులై31,ప్రభాతవార్త:**
గీతాంజలి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 2026=27 విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నూతన విద్యార్థుల కోసం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాం అత్యంత ఉత్సాహవంతంగా,వైభవంగా జరిగింది, కళాశాల ఆవరణమంతా నూతన విద్యార్థుల రాకతో సందడిగా మారింది.కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ సాగర్ ప్రారంభించి నూతన విద్యార్థులకు సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ లేని శ్రమ ఫలించదన్నారు.కఠినమైన క్రమశిక్షణను పాటిస్తూ,స్థిరమైన పట్టుదలతో నిరంతరం కష్టపడితే విద్యార్థులు ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు.మీరంతా కళాశాలకు వచ్చిన నక్షత్రాలు మీకు సరైన దారి చూపి ప్రోత్సాహం అందించడం మీ భాధ్యత అని అన్నారు.కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని,ఉపాధ్యాయులను సంప్రదించడానికి ఎప్పుడూ వెనుకాడవద్దని సూచించారు.

## నిచ్చెన గుర్తుకు ఓటేయండి

పద్మశాలి టౌన్‌షిప్ అభివృద్ధే లక్ష్యం. వేముల దీప.

**జవహర్ నగర్, జులై .31.ప్రభాత వార్త.**
శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో నిచ్చెన గుర్తుపై అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న వేముల దీప తన ఎన్నికల హామీలను ప్రకటించారు. కలిసికట్టుగా ముందుకు వెళ్దాం. పద్మశాలి టౌన్‌షిప్‌ను అందరికీ ఆదర్శంగా తీర్చిదిద్దుదాం అనే నినాదంతో ఆమె ప్రచారం కొనసాగిస్తున్నారు.2030 నాటికి పద్మశాలి టౌన్‌షిప్‌ను స్వయం సమృద్ధితో కూడిన ఆదర్శ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు, మెరుగైన పారిశుద్ధం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వీధి దీపాల నిర్వహణ, దోమల నివారణ చర్యలు, పార్కుల అభివృద్ధి, ప్లాస్టిక్ రహిత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.నివాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఓపెన్ ఫోరం, ఆరు నెలలకు జనరల్ బాడీ సమావేశం నిర్వహించి ఆదాయం వ్యయాల వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తామని తెలిపారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలు, గ్రంథాలయం, యువతకు కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, ప్రభుత్వ బస్సు సర్వీసు పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.నిచ్చెన గుర్తుపై అధ్యక్షురాలిగా వేముల దీప, ఉపాధ్యక్షుడిగా భీమగాని సదానందం, ప్రధాన కార్యదర్శిగా బోగ వెంకటేష్, ట్రెజరర్‌గా జయకర్ దర్గా తదితరులు పోటీ చేస్తున్నారని తెలిపారు. సురక్షితమైన, పరిశుభ్రమైన, పారదర్శకమైన పద్మశాలి టౌన్‌షిప్ నిర్మాణానికి నిచ్చెన గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని వేముల దీప నివాసితులను కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగులు

**ఘట్‌కేసర్, జులై 31, ప్రభాతవార్త:** పేదప్రజల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలో సాధ్యమైందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్ కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ లింగాపురం కాలనీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇందిరమ్మ పథకం కింద లబ్దిదారురాలు లింగాల భూలక్ష్మి యాదగిరి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగా మహేశ్‌గౌడ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈసందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేస్తుందని, రానున్న రోజులలో అర్హులైన ప్రతి ఒక్కరికి మరిన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈసందర్భంగా లబ్దిదారు నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.



హైమాక్స్ లైట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

## సొంత నిధులతో హై మాస్ట్ లైట్స్ ఏర్పాటు

**జిల్లెడు చౌదరిగూడ,జులై 31,(ప్రభాతవార్త):** జిల్లెడ్‌చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ..ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో రెండు హై మాస్ట్ లైట్స్‌లను ఏర్పాటుచేశారు.చీకట్లను పారద్రోలుతూ,గ్రామ కూడలిలో మెరుగైన వెలుతురును అందించేందుకు తన సొంత నిధులతో గ్రామంలో హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు మృతి

**తలకొండపల్లి, జులై 31, ప్రభాతవార్త:**తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మాతృమూర్తి వెల్దండ సుభద్ర అనే వృద్ధురాలు శుక్రవారం నాడు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యానికి గురైన వృద్ధురాలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు తీరని లోటని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ ప్రకాష్ బాల్రెడ్డి గ్రామస్తులు తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## గ్రామాలు పురోగతి సాధించాలి

**జిల్లెడు చౌదరిగూడ,జులై 31,(ప్రభాతవార్త):** గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో పురోగతిని సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో రైతులను ఎప్పటికప్పుడు ఆరుతడి పంటలను సాగు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అప్రమత్తం చేయాలని ఏవో రాజేందర్ రెడ్డికి సూచించారు. వ్యవ సాయ ఉద్యానవన శాఖల అధికారులు గ్రామాల్లో క్లస్టర్ల వారిగా సమా వేశాలు ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీలను వివరించి వారు వినియోగించుకునే విధంగా చూడాలని అన్నారు. కూర గాయల నారు జీడిమెట్లలో ఉన్నందున ఇబ్బందులు పడుతున్న విష యాన్ని జాకారం సర్పంచ్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందిస్తూ ఐదు నుంచి పది ఎకరాల ప్రభుత్వ స్థలం గుర్తించి ఇక్కడే మొక్కలు పెంచుకునే విధంగా కృషి చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో ఇటీవల విద్యుత్ శాఖ బాధ్యతలు చేపట్టిన నరసింహ అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా స్పందిస్తున్నారని అధికార ప్రతిపక్ష సర్పంచులు ఎమ్మెల్యే ముందు వివరించడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఏ నరసింహులు శభాష్ ఇలాగే పని చేయండి మీకు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడానికి ఏ సామాగ్రి అవసరం ఉందో వెంటనే నాకు చెప్పండి నెలరోజుల్లోగా ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేయండి అంటూ తెలిపారు. గ్రామాల్లో గెలుపొందిన వారు ప్రజలకు జవాబు దారితనంతో పని చేయాల్సి ఉంటుంది కాబట్టి అధికారులు ఎప్పుడూ వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. ధర్మ తండా పీర్జాపూర్, పద్మారం, ముష్టిపల్లి, తుమ్మలపల్లి, చౌదరి గూడెం, చెగిరెడ్డి ఘనపూర్, గ్రామాల సర్పంచులు పలు విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే వాటిని పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో నీటి సరఫరాస క్రమంగా లేకున్నా, పనులు సరిగా పూర్తికాకున్నా పైకి రిపోర్టులు మాత్రం సక్రమంగా పంపించి ప్రజలను ఇబ్బంది పెట్టారని మిషన్ భగీరథ స్కీమ్ అట్టర్ ఫ్లాప్ అయిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పలువురు సర్పంచులు గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా రావడం లేదని మూడు రోజులు వస్తే మూడు రోజులు ఆపేస్తున్నారని, జిల్లేడులో నీరు పూర్తిగా కలుషితంగా వస్తుందని సర్పంచ్ మోనిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో సొంత కార్యాలయాలు నిర్మించడానికి కట్టుబడి ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. లాల్‌పహాడ్ నుంచి చౌదరి గూడెం వరకు రెండు లైన్ల దాదారి మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంపీడీవో భవనం నిర్మిస్తున్నారని త్వరలో హాస్పిటల్ కోసం టెంకాయ కొట్టనున్నట్లు తెలిపారు. తహసిల్దార్ కార్యాలయం సైతం మంజూరు చేయించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగె మండలంలో పోలీస్ స్టేషన్ నిర్మాణంపై వస్తున్న ఆరోపణల విషయం నాకు ఇటీవల తెలిసిందని ప్రజలు, అన్ని పార్టీల నాయకుల అభిప్రాయం మేరకు ప్రజా అవసరాలను పరిగణలోకి తీసుకొని పోలీస్ స్టేషన్ నిర్మిద్దాం అని అన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచులు ఓడిన అభ్యర్థులు గ్రామ పెద్దలు అందరూ కలిసి గ్రామాభివృద్ధి కోసం ఏం చేస్తే బాగుంటుంది అన్న విషయాలను పరిగణలోకి తీసుకోవాలని ఏ పరిస్థితుల్లో గెలిచిన ఎలా గెలిచిన ప్రజలు అవకాశం ఇచ్చిన సర్పంచులు శాశ్వతం కానీ ఈ పదవులలో కక్ష సాధింపులకు పోకుండ గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశలో ముందుకు సాగాలని అవసరమైతే అన్ని శాఖల అధికారులను మండలానికి పంపిస్తానని సర్పంచులందరూ మీ సమస్యలు అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని అవి పరిష్కారం కాని నేపథ్యంలో నన్ను సైతం ప్రశ్నించే హక్కు మీకు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చంద్రశేఖర్, నర్సింలు, నీలయ్య, రామచంద్రయ్య, జంగ య్య, జంగయ్య, చందు నాయక్, మోనాచారి, రవి నాయక్, విజయలక్ష్మి, పావని, సుమలత, మహబూబ్ బీ, అరుణ, సనా, సునీ త, స్వప్న, జిల్లేడు మోనిక, వివిధ శాఖల అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమంలో సోక్‌పిట్ల ప్రారంభం

**మాడ్గుల,జులై 31,ప్రభాతవార్త:** మాడ్గుల మండలంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ సోక్‌పిట్,కమ్యూనిటీ సోక్‌పిట్లను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు.ఈ సోక్‌పిట్ల నిర్మాణం ద్వారా మురుగు నీటి నిర్వహణ మెరుగుపడటంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు దోహదం చేయనున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సమావేశంలో మండలంలోని సర్పంచులు,తహసీల్దార్,మండల స్థాయి అధికారులు,వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,ప్రజా సమస్యలు,తాగునీటి సరఫరా, పారిశుధ్యం,రహదారులు,ఇతర మౌలిక వసతులు,పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో నాణ్యంగా అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల అభివృద్ధే లక్ష ్యంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.సమావేశంలో అధికారులు తమ శాఖల పురోగతి నివేదికలను ఎమ్మెల్యేకు వివరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# మెడికల్ షాపులో ప్లాస్టిక్ కవర్ల నిషేధం

**స్వచ్ఛందంగా ప్రకటించిన మెడికల్ అసోసియేషన్**

**ఆమనగల్లు, జులై31, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ కొరకు స్వచ్ఛందంగా ఆగస్టు 15 నుండి ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలు పరుస్తున్నట్లు ఆమనగల్లు మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. ప్లాస్టిక్ కవర్ల నిషేధంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని వారు కోరారు. శుక్రవారం మెడికల్ అసోసియేషన్ సభ్యులందరూ మునిసిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన చాంబర్లో కలుసుకుని ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలును వివరించారు. దీంతో కమిషనర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్టు 15 నుండి ఎటువంటి ప్లాస్టిక్ కవర్లు వినియోగించమని మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. భావితరాలకు ప్లాస్టిక్ భూతంలా మారిందని, ప్రజలు కూడా ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటే మరింత ప్రయోజనం చేకూరుతుందని కమిషనర్ పిలుపునిచ్చారు. మెడికల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నటరాజ్ యాదయ్యగుప్త, రవీంద్రనాథ్ గుప్తా, ఉప్పల రాములుయాదవ్, వర్కాల శేఖర్, కండె ప్రవీణ్, జగదీశ్వర్ రెడ్డి, బాణావత్ హనుమంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు రాతపూర్వక పత్రాన్ని అందజేస్తున్న మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు




దంతవైద్య శిబిరంలో చికిత్సలు నిర్వహిస్తున్న దంతవైద్యులు, తదితరులు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ శ్రీనివాస్**

**మోమిన్‌పేట్, జులై 31. ప్రభాతవార్త:** మారుమూల గ్రామాలలో నిర్వహించే ఉచిత వైద్య శిభిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామంలో వికారాబాద్ కొత్రేపల్లి శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ డెంటల్ సర్జరి వారి ఆద్వర్యంలో ఈ ఉచిత వైధ్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అంటు కొనియాడారు. నేటి ఈ శిబిరంలో 65, మందికి దంత పరీక్షలు నిర్వహించగా 25, మందికి స్కానింగ్, 8, మందికి ఫిల్లింగ్, 5, మందికి ఎక్ట్రాషియం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి దంతాలను శుభ్రపరిచి, అవసరమైన వారిని ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు దంత కళాశాల పీఆర్ఓ సి. రవిందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్, కెజియా. డా, సాత్విక. డా, సుమయ్య. డా, యాస్మీన్. డా, ఐశ్వర్య ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు రఘురాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దామోదర్ సాగర్, ప్రభుసాగర్, సంజీవరెడ్డి, సయన్న, నర్సింలు, మహేష్, పంచాయతి కార్యధర్శి వెంకటేశ్వర్ రెడ్డి, జీపిఓ వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## జియాపల్లి-ఉప్పల్ బస్సు నడపాలని వినతి



చెంగిచర్ల డిఎం స్వాతికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జులై 31, ప్రభాతవార్త:** జియాపల్లి ఉప్పల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి శుక్రవారం చెంగిచర్ల డిపో మేనేజర్ స్వాతిని కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలు, విద్యార్థులు, కార్మికులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం అత్యవసరమని, ప్రైవేట్ రవాణాతో రోజువారీ వేతనంలో అధిక భాగం ఖర్చవుతోందని ఆయన తెలిపారు. బస్సు సౌకర్యం లేక జియాపల్లి, జమీలాపేట్, నెమురగొముల, అవుషాపూర్ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, కూలి పనులకు వెళ్లే మహిళలు రాత్రి వేళల్లో రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో వారి రోజువారీ వేతనంలో గణనీయమైన భాగం రవాణా ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. జియాపల్లి నుండి అవుషాపూర్ మీదుగా ఉప్పల్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించి ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు, కార్మికులకు ఉపశమనం కల్పించాలని ఆయన డిఎంకు విజ్ఞప్తి చేశారు. డిపో మేనేజర్ ఎస్.స్వాతి సమస్యను సానుకూలంగా పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిహెచ్‌ఎంసి బీసీ సంఘం ఉపాధ్యక్షులు కొమ్మరాజు సతీష్‌కుమార్ ఉన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**శంషాబాద్, జులై 31 ,ప్రభాతవార్త :** శంషాబాద్‌లోని ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌జిఐఎ ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు రోడ్డు దాటే విధానం, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత, జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాల్సిన అవసరం, మైనర్లు వాహనాలు నడపకూడదనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.అలాగే రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేసి సమాజంలో రహదారి భద్రతపై అవగాహన పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ నూరుద్దీన్‌కు ఘన వీడ్కోలు

**శంషాబాద్, జులై 31,ప్రభాతవార్త :** పదవీ విరమణ ఉద్యోగ జీవితానికే పరిమితమని, సమాజ సేవకు కాదని సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం ఆర్‌జీఐఎ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సంవ త్సరకాలంగా ఎస్ఐగా విధులు నిర్వహిం చిన మహమ్మద్ నూరుద్దీన్ పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్య క్రమంలో సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి మహ మ్మద్ నూరుద్దీన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.సేవాకాలంలో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు, శాఖకు విశేష సేవలందించిన మహమ్మద్ నూరుద్దీన్ సేవలను అధికారులు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ సహచర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ట్రాఫిక్ ఎస్ఐను సన్మానిస్తున్న సైబరాబాద్ సిపి రమేష్ రెడ్డి

## కేంద్రం దృష్టికి డంపింగ్ యార్డ్ అంశం

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఢిల్లీలోని ఆమె నివాసంలో బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల సిద్ధాపూర్ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడి ప్రజల మనోభావాలు, అన్ని వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన ఐక్యత, డంపింగ్ యార్డ్‌పై ఉన్న వ్యతిరేకత, ఆరోగ్య మరియు పర్యావరణ సంబంధిత ఆందోళనలను డీకే అరుణ పూర్తిగా అర్థం చేసుకున్నారని నాయకులు వివరించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఆమెతో చర్చించారు.ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో పాటు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్కు లేఖ రాసి సమస్యను సమగ్రంగా వివరించనున్నట్లు డీకే అరుణ తెలిపారు. సిద్ధాపూర్ ప్రాంత ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎంపీ డీకే అరుణ హామీ ఇచ్చారు.



డీకే అరుణ తో మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనిజంగయ్యయాదవ్, కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

## సిసి రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

**ఘట్‌కేసర్, జులై 31, ప్రభాతవార్త:** ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న అభి వృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ డివిజన్ రాఘవేంద్రనగర్‌లో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరి శీలించారు. రూ.10 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ రాఘవేంద్ర నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఈరోజు సిసి రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు పనులల్లో నాణ్యమైన మెటీరియల్ వినియోగించి సకాలంలో రోడ్డు పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ కార్య క్రమంలో మాజీ కౌన్సిలర్ కడపొల్ల మల్లేష్, మాజీ డిసిసి కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణముదిరాజ్, బొక్క సత్తిరెడ్డి, బొక్క సుధాకర్ రెడ్డి , కడపొల్ల రాజు, మామిళ్ళ మల్లేష్‌యాదవ్, అందెల సాయి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచాన్ని మార్చగల శక్తి సామర్థ్యాలు కాంటం కంప్యూటీకరణకు ఉంది

**ఐఈఈఈ కో కన్వీనర్ ఎన్‌పీజీఎల్ నారాయణ**



జిటికె.రూరల్,పోటో.1 .అనురాగ్ యూనివర్శిటీలో కంప్యూటింగ్ ది

**ఘట్‌కేసర్ రూరల్, జులై 31,ప్రభాతవార్త:** కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, కాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు ఎక్స్‌టెండెడ్ రియాలిటీ సాంకేతికతలు ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ఐఈఈఈ కో కన్వీనర్ ఎన్‌జీపీఎల్ నారాయణ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో కంప్యూటింగ్ ది ఫ్యూచర్ అంశంపై ఐఈఈఈ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేశ్ నార్తి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణలు, పరిశోధనలు సాంకేతిక ఆవిష్కరణల ద్వారా ఎనిమిది దశాబ్దాలుగా ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ అందిస్తున్న విశిష్ట సేవలను కొనియడారు. ఐఈఈఈ లక్ష్యాలను, సాంకేతిక పురోగతిని ముందుకు తీసుకెళ్లడంలో అనురాగ్ యూనివర్శిటీ అధ్యాపకులు, నిపుణులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. విద్యార్హతలు సర్టిఫికెట్లలో మాత్రమే నిలిచిపోతాయని ఐఈఈఈ సభ్యత్వం జీవితకాలం పాటు వృత్తిపరమైన సహచరుడిగా నిలుస్తుందని అన్నారు. నిరంతరం నేర్చుకునే తపనే ఒక ఇంజినీర్ వృత్తి జీవితంలో అత్యంత విలువైన నైపుణ్యమని అన్నారు. ప్రతి విద్యార్థిని ఐఈఈఈ సభ్యత్వం పొందేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చనా మంత్రి, మహేశ్ నార్తి, మోహన్ రాయుడు, ఐఈఈఈ వైస్ చైర్మన్ బాల ప్రసాద్, ఎన్‌జీపీఎల్ నారాయణ, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ విజయ కుమార్, సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి, ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎం. సంధ్యరాణి, పద్మసాయి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎం అనురాధకు ఘన వీడ్కోలు



అనురాధను సన్మానిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ చిన్నకుంట బడి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా వీడ్కోలు కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 16వ వార్డు క్రిస్టియన్ కాలనీ కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి ృ కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై అనురాధను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక ‘ను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనురాధ విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల ప్రగతి కోసం ఎంతో అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆమె చేసిన సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.అనంతరం ఎంఈ ఓ, సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ అనురాధతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆమె పదవీ విర మణ అనంతర జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఉపా ధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొని అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు.



సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## అనారోగ్య బాధితుడికి రూ.2 లక్షల ఎల్ఓసి

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతున్న షాద్‌నగర్ పట్టణ వాసి పత్తి అంజయ్యకు మెరుగైన వైద్య చికిత్స కోసం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.2 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. బాధితుడి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు తక్షణమే స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. మంజూరైన ఎల్.ఓ.సి సహాయాన్ని టిఆర్ఎస్ నాయకుల ద్వారా లబ్దిదారునికి ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కార్యాలయం షాద్ నగర్ లో అందజేశారు.ఈ కార్యక్రమంలో మొదళ్లగూడ సర్పంచ్ పెండ్యాల అరుణ రాజు, టిఆర్ఎస్ నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి,అనుమరి రాజు,ఆవుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 14 ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం

**సిఎస్కే కాలనీ రహదారుల అభివృద్ధికి డిమాండ్**

**షాద్‌నగర్, జులై 31, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే కాలనీలో గత 14 సంవత్సరాలుగా రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికుడు మహమ్మద్ రఫీయోద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాలను మీడియాకు అందజేశారు. బాధితుడి వివరాలు ప్రకారం కాలనీలోని రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయి. వర్షాలు కురిసిన ప్రతిసారీ నీరు నిలిచి బురదమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, గర్భిణీలు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రహదారుల దుస్థితి కారణంగా అత్యవసర సేవలు సకాలంలో అందడం లేదని, వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని మహమ్మద్ రఫీయోద్దీన్ తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీయోద్దీన్ మాట్లాడుతూ, సీఎస్కే కాలనీలోని రహదారులను వెంటనే మరమ్మతు చేసి, నాణ్యమైన శాశ్వత సిమెంట్ కాంక్రీట్ రహదారులను నిర్మించాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలని, అన్ని అభివృద్ధి పనులను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని, కాలనీవాసులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గత 14 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కాలనీవాసులకు ఇకనైనా న్యాయం చేయాలని, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన రహదారి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని, సంబంధిత ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని మహమ్మద్ రఫీయోద్దీన్ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ శ్రావణి, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు.



సీఎస్కే కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి